RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 01 సంచిక - 331 పేజీలు - 04 వెల - 05/- మంగళవారం13 ఆగష్టు 2024



విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006 9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక




## అమరావతి కోసం మొదటి నెల జీతం విరాళంగా ఇచ్చిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి.!

ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 12:
ఏపీ రాజధాని అమరావతి నిర్మాణం కోసం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విరాళం అందజేశారు. తన మొదటి నెల వేతనాన్ని రాజధాని నిర్మాణానికి విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు రూ.3,01,116ను చెక్కు రూపంలో అందజేశారు. ఈ చెక్కును సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి అందజేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించండి.!



- -వైద్య ఆరోగ్య శాఖలో ఉత్తమ విధానాలు అమలు చేయండి.
- - టెలి మెడిసిన్ ద్వారా మెరుగైన వైద్య సేవలు.
- -గత ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రులను భ్రష్టుపట్టించడంతో ప్రజల్లో నమ్మకం సన్నగిల్లింది.
- -కిడ్నీ బాధితుల వివరాలు మండలాల వారీ సేకరించాలి.
- - ప్రభుత్వాసుపత్రుల్లో పరిశుభ్రత తప్పని సరి.రోగులకు శుభ్రమైన బెడ్ షీట్లు అందించాలి.
- -డోలీ మోతలు కనిపించకూడదు...ఫీడర్ అంబులెన్స్ ల ద్వారా రోగులను తరలించాలి.
- -క్యాన్సర్ పై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.
- -వైద్యఆరోగ్య శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు.

2లో

## అన్నదాతకు అండగా నిలబడతాం.!

-రైతులకు 50 శాతం సబ్సిడీతో టార్పాలిన్ల సరఫరా.

-ప్రతి కౌలు రైతుకూ గుర్తింపు కార్డు.


-కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి.. ప్రతి అడుగులో రైతుకి పెద్దపీట

-గత ప్రభుత్వం రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టింది.

-పౌరసరఫరాల శాఖనూ అప్పుల్లో ముంచేసింది.

-చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రానికి పునర్వైభవం తెస్తాం.

-రైతుల ధాన్యం బకాయిల చెల్లింపు కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్.



ఆంధ్ర ప్రగతి ఏలూరు ఆగస్టు 12:
'కూటమి ప్రభుత్వం ప్రతి అడుగులో రైతు పక్షపాతిగా నిలబడుతుంది. రైతన్నకు పెద్దపీట వేస్తుంది. రైతుకి ఎలాంటి నష్టం జరగకుండా అండగా నిలబడుతుంది. అన్నదాతకు ఆర్థిక కష్టాలు లేకుండా, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిలబడుతుంద'ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ భరోసా ఇచ్చారు. ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతు ఖాతాలో డబ్బులు వేస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రైతాంగాన్ని సంక్షోభంలో నెట్టిందనీ, రైతాంగం పడిన కష్టాలు ప్రత్యక్షంగా చూశామని, అలాంటి కష్టాలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి రైతులకు ధాన్యం అమ్మిన 48 గంటల్లోపు సొమ్ము ఖాతాల్లో పడే ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. పంటల బీమా ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లించే ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకి అండగా నిలిచేందుకు పౌరసరఫరాల శాఖ, కూటమి ప్రభుత్వం నిరంతరం పని చేస్తాయని హామీ ఇచ్చారు. **మిగతాది 2లో...**

## ఆటో కార్మికుల కోసం ఎంఎస్ఎమ్ఈ ఆటో పార్క్ ఏర్పాటుచేయాలి.!

**-మంత్రి నారా లోకేష్.**



ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 12: కష్టాల్లో ఉన్నామంటే చాలు.. క్షణం ఆలోచించకుండా ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నారు విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్. ఉండవల్లిలోని నివాసంలో 24వ రోజు "ప్రజా దర్బార్" కు మంగళగిరితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తుల తక్షణ పరిష్కారానికి సిబ్బందికి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. దీంతో తమ కష్టాలు విన్నవించుకునేందుకు "ప్రజాదర్బార్" కు వచ్చిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం మంగళగిరిలో ఎమ్ఎస్ఎమ్ఈ ఆటో పార్క్ ఏర్పాటుచేయాలని మోటార్ టెక్నీషియన్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి కోరారు. మంచానికే పరిమితమైన తనకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన పిల్లి శివమ్మ విజ్ఞప్తి చేశారు. భర్త లేని తాను ముగ్గురు పిల్లలతో 26 ఏళ్లుగా అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నానని, ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని మంగళగిరి నియోజకవర్గం ఆత్మకూరుకు చెందిన చింతలచెర్వు మరియమ్మ కోరారు. విద్యుత్ బిల్లు అధికంగా వచ్చిందనే నెపంతో గత ప్రభుత్వం తొలగించిన దివ్యాంగ పెన్షన్ పునరుద్ధరించాలని తాడేపల్లికి చెందిన ఎన్.కేశవరావు విజ్ఞప్తి చేశారు. హత్యకు గురైన తన సోదరుడి డెత్ సర్టిఫికెట్ మంజూరుకు ఆదేశాలు ఇవ్వాలని తాడేపల్లికి చెందిన జి.ప్రసాదరావు కోరారు. ఎంసీయే చదివిన తనకు ఉద్యోగం కల్పించాలని మంగళగిరి నియోజకవర్గం పెదవడ్లపూడికి చెందిన జే.మానస విజ్ఞప్తి చేశారు. ఆయా విన్నపాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

## విక్రమ్ సారాభాయ్ జీవితం స్ఫూర్తిదాయకం.!

**-ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.**



ఆంధ్రప్రదేశ్ అమరావతి ఆగస్టు 12:
అంతరిక్ష శాస్త్రవేత్త విక్రమ్ సారాభాయ్ జీవితం ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు.ఒక శాస్త్రవేత్త దేశం గురించి తన చుట్టూ ఉన్న సమాజం గురించి ఆలోచన చేస్తే ఎంతటి గొప్ప ఫలితాలు వస్తాయో దివంగత విక్రమ్ సారాభాయ్ జీవితాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది. ఈ రోజు మన దేశం అంతరిక్ష పరిశోధన, తత్సంబంధిత రంగాల్లో గణనీయ విజయాలు సాధిస్తుందీ అంటే– స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే ఈ రంగంలో విశిష్ట సేవలందించిన శాస్త్రవేత్త విక్రమ్ సారాబాయ్ దూర దృష్టి కారణం. భౌతిక శాస్త్ర పరిశోధనాలయం ఏర్పాటు చేయడం, మన దేశానికి శాటిలైట్ ఆవశ్యకత గురించి నాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ని ఒప్పించడం, ఇండియన్ నేషనల్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ సెంటర్ నెలకొల్పడం ద్వారా దేశంలో అంతరిక్ష రంగం అభివృద్ధి చెందింది. మన దేశం అంతరిక్ష రంగ పితామహుడుగా కీర్తి పొందిన శ్రీ విక్రమ్ సారాభాయ్ జయంతి నేడు. ఆ మహనీయుడికి మనస్ఫూర్తిగా అంజలి ఘటిస్తున్నాను. మన దేశం అంతర్జాతీయంగా అర్థవంతమైన పాత్ర పోషించగలగాలంటే, ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని మానవ సమాజ సమస్యల పరిష్కారానికి ఉపయోగించుకోవడంలో మనం ఎవరికీ తీసిపోకుండా ఉండాలని చెప్పిన శ్రీ విక్రమ్ సారాభాయ్ మాటలు నవతరం శాస్త్రవేత్తలు ఆచరణలో చూపాలని ఆకాంక్షిస్తున్నాను. ఆయన అందించిన స్ఫూర్తితో శాస్త్ర సాంకేతిక రంగాల ద్వారా సమాజానికి మేలు కలిగించే మరిన్ని పరిశోధనలు ఆవిష్కృతం కావాలి.

# ఐ ప్యాక్ టీం వైపే జగన్ ముగ్గు..

## వైసీపీలో నిస్తేజం.!

ఆంధ్ర ప్రగతి తాడేపల్లి ఆగస్టు 12:
ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి తన సొంత పార్టీ నేతల కంటే ఐప్యాక్ నివేదికలపైనే ఎక్కువ నమ్మకం ఉండేదన్న విషయం తెలిసిందే. 2019 ఎన్నికలలో తన పార్టీ ఘన విజయం సాధించి తాను ముఖ్యమంత్రిగా అధికార పగ్గాలు చేపట్టడానికి ఐప్యాక్ వ్యూహాలే కారణమన్నది ఆయన నమ్మకం.అదే నమ్మకంతో జగన్ ఐప్యాక్ నివేదికలే నమ్ముకుని జగన్ 2024 ఎన్నికలకు వెళ్లారు. అయితే ఈ సారి మాత్రం ఐప్యాక్ వ్యూహాలు జగన్ కు రిత్ర కనీవినీ ఎరుగని పరాజయాన్ని మిగిల్చాయి. 2019 ఎన్నికల విజయం తరువాత 2019 ఎన్నికలలో పార్టీ కోసం పని చేయడానికి జగన్ ఐప్యాక్కు 350 కోట్ల రూపాయలు చెల్లించినట్లు




చెబుతారు. అంటే 2024 ఎన్నికలలో ఐప్యాక్ కు జగన్ అంత కంటే ఎక్కేవే చెల్లించి ఉంటారు.అసలు ఐప్యాక్ అనేది వైసీపీలో ఒక భాగంగా మారిపోయింది. ప్రభుత్వ పాలనా వ్యవహారాలలో నిండా తల దూర్చింది. ఐప్యాక్ తో ఒప్పందం ప్రకారం చెల్లించాల్సిన సొమ్ములకు జగన్ సంస్థకు కొన్ని కాంట్రాక్టులు ఇచ్చారనీ, అలా ఐప్యాక్ కు పార్టీ పరంగా చెల్లించాల్సిన సొమ్ములు ముట్టచెప్పారని పార్టీ వర్గాలు బాహాటంగానే చెప్పుకున్నాయి. అంతే కాకుండా పలువురు ఐప్యాక్ సభ్యులను వివిధ ప్రభుత్వ సంస్థలలో ఉద్యోగులుగా అప్పాయింట్ మెంట్ పత్రాలు ఇచ్చి ప్రభుత్వ ఖజానా నుంచి వేతనాలు చెల్లించారని కూడా తెలిసింది.
ఇక ఐపాక్య సభ్యులైతే వైసీపీ ఎమ్మెల్యేలను నీడలా ఫాలో అవుతూ వారేం చేయాలో నిర్దేశించేవారు. కొన్ని కొన్ని నియోజకవర్గాలలో అయితే ఐప్యాక్ సభ్యులే వైసీపీ అభ్యర్థులను ఎంపిక చేశారు. 2024 ఎన్నికల పోలింగ్ ముగిసిన తరువాత జగన్ ఐప్యాక్ కార్యాలయానికి వెళ్లి అక్కడ వారితో ఫొటోలు తీయించుకున్నారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతం కంటే అధిక స్థానాలను గెలుచుకోబోతున్నామని ప్రకటించారు కూడా.
అయితే తీరా ఎన్నికలు వచ్చిన తరువాత గతంలో ఏ పార్టీ ఓడిపోనంత ఘోరంగా వైసీపీ పరాజయం పాలైంది. **మిగతాది 2లో...**

# మెరుగైన వైద్య సేవలు అందించండి.!

ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 12: వైద్య ఆరోగ్య శాఖలో 2014-19 మధ్య అమలు చేసిన ఉత్తమ విధానాలను మళ్లీ ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అస్తవ్యస్థ విధానాలతో గత ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రులను భ్రష్టు పట్టించిందని, తద్వారా ప్రజల్లో నమ్మకం సన్నగిల్లిందని సీఎం అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో మళ్లీ నమ్మకం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. సమీక్షలో చంద్రబాబు మాట్లాడుతూ...."ప్రభుత్వం తరపున యాప్ రూపొందించి హెల్త్ కార్డు ద్వారా ప్రైవేట్ ఆసుపత్రిలో చేరిన వ్యక్తికి సంబంధించిన వివరాలు పొందుపరచాలి. ఆసుపత్రి రోగికి అందించే వైద్య సేవలు, ఎక్విప్ మెంట్, ఇచ్చే మెడిసిన్ వివరాలు కూడా ఉండాలి. ఇలా చేయడం వల్ల ఆసుపత్రి పనితీరు ఎలా ఉందో తెలుస్తుంది. రాష్ట్రంలో కిడ్నీ బాధితులు ఎంత మంది ఉన్నారో మండలాల వారీగా వివరాలు సేకరించాలి. కిడ్నీ సమస్య కారణాలపై అధ్యయనం చేయాలి. కిడ్నీ వ్యాధులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న నీటి సదుపాయంపైనా లోతైన అధ్యయనం చేయాలి. గతంలో ఉద్దానంలో పూర్తిస్థాయిలో రీసెర్చ్ చేయడం వల్లే పూర్తిస్థాయిలో సమస్యను గుర్తించగలిగాం. ఉద్దానంలాగే ఇప్పుడు మరికొన్ని ప్రాంతాల్లో కిడ్నీ సమస్యలు తలెత్తుతున్నాయి. పేదలకు అందుబాటులో ఉండేలా సిటీ స్కాన్ సర్వీసెస్ ను ముందుగా అన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రుల్లో ఏర్పాటు చేయాలి. ప్రి ల్యాబ్ టెస్ట్ ల అనంతరం పేషెంట్లకు సరైన విధానంలో మెడిసిన్ ఇవ్వగలిగితే 50 శాతం కంట్రోల్ చేయొచ్చు. రోగులకు డైట్ ప్లాన్, న్యూట్రిషన్ పై అవగాహన కల్పించగలిగితే వ్యాధుల నుండి కాపాడవచ్చు. రాష్ట్రంలో టీబీ రోగులు ఎంతమంది ఉన్నారో సమగ్ర అధ్యయనం చేసి వారికి కంటిన్యూగా మెడిసిన్ అందించాలి. ఆసుపత్రులలో ప్రసవం తర్వాత శిశువుల మిస్సింగ్ కేసులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి...మిస్సింగ్ కేసులు వస్తే అధికారులపై చర్యలు తప్పవు. ఎన్టీఆర్ బేబీ కిట్స్ ను మళ్లీ తల్లులకు అందించాలి. బేబీలకు అవసరమైన సామాగ్రిని కిట్స్ ద్వారా అందించాలి. ప్రతి స్కూలులో పిల్లలకు కంటి పరీక్షలు చేసిన తర్వాత ఏం యాక్షన్ తీసుకున్నారో రిపోర్టు చేయాలి. టెలీ మెడిసిన్ కు గతంలో వరల్డ్ బ్యాంకు నుండి రూ.2,300 కోట్లు నిధులు తీసుకొచ్చాం. కార్పొరేట్ లెవల్లో సేవలు అందించాలని నిర్ణయించాం. గ్రామాల్లో ఉండేవారికి టెలీ మెడిసిన్ ద్వారా మంచి డాక్టర్లతో అందించాలని నిర్ణయించాం. కానీ దాన్ని గత ప్రభుత్వం సరిగా అమలు చేయలేదు. టెలీ మెడిసిన్ పై ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలు అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేసేలా యాక్షన్ ప్లాన్ రెడీ చేయాలి. అంగవైకల్యంతో బాధపడేవారికి వివిధ రూపాల్లో పెన్షన్ అందిస్తున్నాం. సదరం ఫేక్ సర్టిఫికేట్ల జారీపై చర్యలు తీసుకోవాలి. ఈ అంశంపై పూర్తిస్థాయిలో సమాచారం కోసం పంచాయతీ రాజ్ శాఖతో కలిసి పూర్తి సమాచారం అందుబాటులో ఉంచాలి' అని సీఎం అన్నారు. 'ఫీడర్ అంబులెన్స్ కు సాధారణ అంబులెన్స్ కు కనెక్టివిటీ పెంచాలి. డోలీతో ఇంకా మోసుకొస్తున్న సందర్భాలు కనబడుతున్నాయి. డోలీ మోతలు మళ్లీ రిపీట్ అయితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం. ఫీడర్ అంబులెన్స్ లు వెళ్లగలిగినప్పటికీ సాధ్యంకాదని నిర్లక్ష్యం వహిస్తే నేరుగా నేనే ఆ ప్రాంతాన్ని సందర్శిస్తా. 104 అంబులెన్సుల పట్ల ప్రజల్లో సంతృప్తి ఉందా లేదా అన్నది ముఖ్యం. ఏదో వెళ్లి కొన్ని టెస్టులు చేసి వచ్చి మొత్తం పరిష్కరించామని చెప్పడం సరికాదు... ప్రజల సంతృప్తిపై ఆరా తీయాలి. ఆసుపత్రుల్లో చనిపోయిన వారి దేహాలను ఇంటికి చేర్చాలన్న ఉద్దేశంతో గతంలో మహాప్రస్థానం అంబులెన్స్ లను తీసుకొచ్చాం...వాటిని కూడా మరుగున పెట్టారు. అవసరాన్ని బట్టి అంబులెన్స్ ల వినియోగాన్ని పెంచాలి. ఆసుపత్రుల్లో రోగులకు అందించే బెడ్ షీట్లు కూడా నాణ్యత, శుభ్రంతో ఉండాలి. ప్రజల్లో క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వ్యాధిపై అవగాహన తీసుకురాగలిగితే మరణాలను తగ్గించవచ్చు. రాష్ట్రంలో జోన్ల వారీగా సర్వీస్ ప్రొవైడర్ మానిటర్ ఏర్పాటు చేసి ఆసుపత్రుల్లో చేసే శానిటేషన్ ను అబ్జర్వేషన్ చేయాలి. మెడ్ టెక్ జోన్ పట్ల గత పాలకులు నిర్లక్ష్యం వహించారు. యేడాదికి రూ.10 వేల కోట్ల టర్నోవర్ మెడ్ టెక్ జోన్ ద్వారా జరుగుతోంది. తక్కువ ఖర్చుతో అన్ని రకాల మెడికల్ ఎక్విప్ మెంట్ ను అందిస్తోంది. అయినా దీన్ని గత ప్రభుత్వం వినియోగించుకోలేదు. నియోజకవర్గం స్థాయిలో పీపీపీ విధానంలో ఆసుపత్రి ఏర్పాటు చేస్తాం...వారికి ప్రభుత్వమే స్థలం అందిస్తుంది. ప్రభుత్వ, పీపీపీ ఆసుపత్రలను ఒకే గొడుగు కిందకు తీసుకొస్తాం. దేశంలోనే ఏపీ ఆసుపత్రుల పనితీరు బెస్ట్ గా ఉండాలి." అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

# రైతు సేవా కేంద్రంలో చోరీ.!

## -రూ.80.వేల కంప్యూటర్, పరికరాలు మాయం.



ఆంధ్ర ప్రగతి మహానంది, ఆగస్టు 12: మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని పశు వైద్యశాల సమీపంలో రైతు సేవా కేంద్రం 1 లో ఆదివారం రాత్రి చోరీ జరిగిందని మండల వ్యవసాయ అధికారి బి నాగేశ్వర్రెడ్డి సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. సోమవారం ఉదయం విధులకు హాజరవ్వగా, రైతు సేవా కేంద్రం తలుపులు గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టి ఉన్నారని,రూ.80 వేల ఖరీదైన కంప్యూటర్ వాటి పరికరాలు చోరీకి గురైనట్లు గుర్తించి,వెంటనే మహానంది పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# కొత్తూరు సుబ్బరాయునికి వెండి పడిగె వితరణ..!

## -ఆలయ ఈవో యం.రామక్రిష్ణ.



ఆంధ్ర ప్రగతి పాణ్యం ఆగస్టు 12:
ప్రముఖ శైవక్షేత్రం లక్షలాది మంది భక్తుల ఆరాధ్య దైవమైన పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి 1కేజీ వెండి పడిగెను భక్తులు ఆదివారం వితరణ జేసినట్లు ఆలయ ఈవో యం.రామక్రిష్ణ తెలుపారు. కర్నూలు పట్టణమునకు చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు వి.నాగేశ్వరరావు వారి కుటుంబ సభ్యులకు స్వామి వారు ఇంటి ఇలవేల్పు కావడంతో మొక్కు బడిగా ఒక కేజీ వెండి పడిగేను విరాళంగా ఈవో కి అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో స్వామి వారికి అభిషేకములు, అర్చనలు చేసి ప్రసాదము వితరణ జాశారు. ఈ కార్యక్రమములో ఆలయ సిబ్బంది, దాత కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతకు అండగా నిలబడతాం.!

గత ప్రభుత్వం రైతులకు రూ. 1674 కోట్లు ధాన్యం కొనుగోలు బకాయిలు ఉంచింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే రూ. వెయ్యి కోట్లు విడుదల చేయగా, మిగిలిన రూ. 674 కోట్లను ఏలూరులో మనోహర్ సోమవారం ఉదయం విడుదల చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన రైతులకు రూ. 472 కోట్ల ఒకేసారి రైతుల ఖాతాల్లో వేసే ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ "గత ప్రభుత్వ తప్పిదాల కారణంగా ధాన్యం బకాయిలు ఆలస్యం అయినందుకు ప్రభుత్వం తరఫున రైతులను క్షమాపణలు కోరుతున్నాను. గత ప్రభుత్వ వైఫల్యాల కారణంగా ఎన్నో కష్టాలు పడినా తట్టుకుని మీరంతా ముందుకు వెళ్తున్నారు. గత ప్రభుత్వం రైతాంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టేసింది. ధాన్యాన్ని అమ్ముకున్నా చేతికి డబ్బు చేరలేదు. నిబంధనలకు లోబడి రైతులు ధాన్యం అమ్ముకున్నా ప్రతి అడుగులో అక్రమాలు చోటు చేసుకున్నాయి. గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల వల్ల ఎంత నష్టం వాటిల్లిందో చూశాం. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసి రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు గోదావరి జిల్లాల్లో పర్యటించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయమని అడిగితే, నాటి ప్రభుత్వంలో ఉన్న వారు రైతుల్ని ఎన్నో రకాలుగా ఇబ్బందిపెట్టారు. మిల్లర్ వద్దకు ధాన్యాన్ని తరలిస్తే రెండు రోజుల తర్వాత రమ్మనడం, స్లిప్పు తీసుకువెళ్తే తేమ శాతం తేడా ఉందని చెప్పడం. రైతుల నుంచి డబ్బు వసూలు చేయడం వంటి పనులు చేశారు.

గత ప్రభుత్వం చేసిన తప్పులకు బ్యాంకర్లు ఫోన్లు ఎత్తడం మానేశారుకూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుల ఆవేదన గురించి సమీక్ష జరిపితే అధికారులు చెప్పిన లెక్కలు చూసి భయం వేసింది. పౌరసరఫరాల కార్పోరేషన్ ని రూ. 40,550 కోట్ల రుణాల్లో ముంచేశారు. రైతులకు చెల్లించాల్సిన బకాయిలు రూ. 1674 కోట్ల ఉన్నాయని చెబితే వారిని ఎలా ఆదుకుంటామో అర్థం కాలేదు. నెల రోజుల్లోపే నిధులు సమకూర్చుకుని వారికి ఇవ్వాలని కూర్చున్నాం. అధికారులను ఢిల్లీకి పంపి నాబార్డు, ఎన్సీడీసీ అధికారులతో మాట్లాడి రుణాలు తెచ్చే ప్రయత్నాలు చేశాం. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక అరాచకాలకు బ్యాంకర్లు ఫోన్లు ఎత్తడం మానేశారు. పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తే రైతులకు వెంటనే బకాయిలు చెల్లించే ఏర్పాటు చేయమన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు తెలియపర్చి సమన్వయపరచుకుంటూ గత నెలలో రూ. వెయ్యి కోట్లు చెల్లించే అద్భుత కార్యక్రమం చేశాం. మిగులు రూ. 674 కోట్లు ఇప్పుడు ఒకేసారి చెల్లించి రైతులకు భరోసా కల్పించే కార్యక్రమం చేపట్టాం.

రైతులకూ ఈజ్ ఆఫ్ డూయింగ్ వర్తింపు

గత ఐదేళ్లుగా రైతులు పడిన కష్టాలు మామూలు విషయం కాదు. ధాన్యం కొనుగోళ్ల నుంచి గిట్టుబాటు ధర వరకు అప్పట్లో మీ తరఫున పోరాటాలు చేశాం. టీడీపీ నేతలు కూడా రైతుల పక్షాన పర్యటనలు చేశారు. జనసేన పార్టీ తరఫున కౌలు రైతు భరోసా యాత్ర పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి నియోజకవర్గంలో ఏర్పాటు చేశాం. ఈ జిల్లాలో 42 మంది రైతులు ఆత్మహత్య చేసుకోవడాన్ని నమ్మలేకపోయాం. కూటమి ప్రభుత్వంలో కౌలు రైతులకు గౌరవం దక్కే ఏర్పాటు చేస్తాం. పండించిన పంటకు సకాలంలో చెల్లింపులు చేయాలన్న ఆలోచనను ఈ రోజు అమలు చేస్తున్నాం. రైతు భరోసా కేంద్రాలను రైతు సహాయ కేంద్రాలుగా మార్చాము. ఈ పంట ద్వారా సీసీఐసీ కార్డులు ఇచ్చే ఏర్పాటు చేసి కౌలు రైతులందర్నీ ఆదుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. మమ్మల్ని నిలబెట్టిన రైతుల రుణం తీర్చుకుంటాం. గత ప్రభుత్వంలో దళారులు రైతు భరోసా కేంద్రాలను వారి స్వార్థానికి వాడుకున్నారు. రాష్ట్ర ప్రజల్లో ఇప్పటికీ 62 శాతం ప్రజలు వ్యవసాయం మీదే ఆధారపడి ఉన్నారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. వ్యాపారవేత్తలతోపాటు రైతులకు కూడా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సౌకర్యం కల్పిస్తాం. రైతు సహాయక కేంద్రాలకు వెళ్తే సంతృప్తి కలిగే విధంగా వ్యవస్థలో మార్పులు తీసుకువస్తాం. వచ్చే ఖరీఫ్ లో 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేసే ఏర్పాటు చేస్తామని కూటమి ప్రభుత్వం పక్షాన మాటిస్తున్నాం. గత ప్రభుత్వం గోతాలు, ధాన్యం రవాణా విషయంలో రైతులకు అండగా నిలిచింది లేదు. వ్యవసాయ పరికరాలను విస్మరించారు. కూటమి ప్రభుత్వంలో పౌరసరఫరాల శాఖ నుంచి రైతులకు 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లు సరఫరా చేయాలని నిర్ణయించాము. రైతులు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు.ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

కూటమి ప్రభుత్వం ప్రజల పక్షాన నిలబడుతుంది. మా మీద నమ్మకంతో ఓటు వేసి బాధ్యత అప్పగించిన ప్రజల కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 150 కందిపప్పు సరఫరా చేస్తున్నాం. బియ్యం విషయంలోనూ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం. గత ప్రభుత్వం కంప్యూటర్ చీటీ పేరిట దొంగ ప్లాన్ వేసి కొంత మంది మిల్లర్లకే రైతులు అమ్మే విధంగా పథకం వేసింది. కూటమి ప్రభుత్వంలో రైతులు దగ్గరలో ఉన్న మిల్లర్లకే ధాన్యం అమ్మే విధంగా చర్యలు తీసుకుంటాం. రైతులను కాపాడుకుంటాం. ఎక్కడా నష్టపరచం. పౌరసరఫరాల శాఖ రుణాలు రూ.40 వేల కోట్లలో వచ్చే మార్చి 31 నాటికి రూ. 10 వేల కోట్లు తిరగి బ్యాంకర్లకు చెల్లించేందుకు ఏర్పాటు చేస్తున్నాం. పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు నిరంతరం రాష్ట్ర అభివృద్ధి కోసం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పూర్వ వైభవం తెచ్చేందుకు కష్టపడుతున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో అద్భుతమైన వేర్ హౌస్ లు ఏర్పాటు చేస్తాం. ధాన్యం కొనుగోలు విషయంలో ఈ ప్రభుత్వం వెనకాడదు. ప్రతి గింజా కొనుగోలు చేసే విధంగ పని చేస్తాం. వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ, పౌరసరఫరాల శాఖలు సమన్వయంగా పని చేసి ఈ క్రాప్ ద్వారా నష్టపోయిన ప్రతి గింజకి పరిహారం అందే ఏర్పాటు చేస్తామ'ని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణ, చింతమనేని ప్రభాకర్, కామినేని శ్రీనివాస్,బొలిశెట్టి శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, చిర్రి బాలరాజు, రోషన్ కుమార్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ శ్రీ మతి గంటా పద్మశ్రీ, పౌరసరఫరాల శాఖ ఎండీ వీర పాండియన్, ఏలూరు జిల్లా కలెక్టర్ శ్రీమతి వెట్రి శెల్వి పాల్గొన్నారు.

# రాష్ట్రంలో గంజాయి కేసులు విశాఖలోనే ఎక్కువ.!

## -హోంమంత్రి అనిత.

ఆంధ్ర ప్రగతి రాజమండ్రి ఆగస్టు 12'



వైఎస్సార్సీపీ అధ్యక్షుడు జగన్?కు మాజీ సీఎం స్థాయిలో భద్రత కల్పించామని, ఆయనకు భద్రత తగ్గించామని చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. జగన్ భద్రత అంశంపై ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదని, జనంలోకి వస్తే తంతారని భయమా అని ప్రశ్నించారు.రాజమహేంద్రవరంలో జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన హెచ్?పీసీఎల్ పెట్రోల్ బంక్?ను అనిత ప్రారంభించారు. అనంతరం రాజమండ్రి సెంట్రల్ జైలును సందర్శించారు. జైలు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన రెస్టారెంట్, బాక్స్ క్రికెట్?లను అనిత ప్రారంభించారు. క్షణికావేశంలో చేసిన తప్పులకు ఖైదీలు జీవితాంతం శిక్ష అనుభవించడం బాధ కలిగించిందని అన్నారు.అలాగే తమ అధినేత చంద్రబాబునాయుడిని అకారణంగా రాజమండ్రి సెంట్రల్? జైలులోని స్నేహ బ్యారక్?లో ఉంచారని, స్నేహ బ్యారక్ సందర్శించినప్పుడు భావోద్వేగానికి గురయ్యానని అన్నారు. తప్పుచేయనివాళ్లు జైలుకు వెళ్లే పరిస్థితి ఎవరికీ రాకూడదన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఖైదీలకు క్షమాభిక్ష అంశం వదిలేసిందని మండిపడ్డారు. క్షమాభిక్ష కావాలని చాలామంది ఖైదీలు అడిగారని, తాము ఈ అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇటీవల విశాఖ కేంద్ర కారాగారాన్ని పరిశీలించామని, ప్రస్తుతం రాజమండ్రి కేంద్ర కారాగారాన్ని పరిశీలించామని తెలిపారు. జైళ్లలో పరిమితికి మించి ఖైదీలు ఉన్నారని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.విశాఖతో పోలిస్తే రాజమండ్రిలో తక్కువగానే గంజాయి కేసులు ఉన్నాయని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1700 కేసులుంటే విశాఖలోనే వెయ్యి వరకు ఉన్నాయన్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో 1,250 మంది ఖైదీలున్నారని, రాజమండ్రిలోని ఖైదీల్లో 376 మంది గంజాయి కేసుల్లో నిందితులే అని అన్నారు. విశాఖ జైలులో వెయ్యిమందికి పైగా గంజాయి కేసు నిందితుల ఉన్నారన్నారు.బ్రిటీష్ కాలంనాటి ముందు కట్టిన కారాగారాలు ఇవి అని, జైలులోని గోడ కూలిపోయే దశలో ఉందని తెలిపారు. తక్షణమే మరమ్మతులు చేయాలని ఆదేశించామన్నారు. మహిళా కారాగారాన్ని కూడా పరిశీలించామన్న అనిత, ఖైదీలు, జైళ్ల సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నామని వెల్లడించారు. పోలీసు సిబ్బందితో సమానంగా ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారని, జైలు సిబ్బందికి ఆరోగ్య భద్రత కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.జైళ్ల సిబ్బంది, ఫైర్ సిబ్బందికి అన్ని వసతులు కల్పిస్తామన్న హోంమంత్రి హామీ ఇచ్చారు. సెంట్రల్ జైళ్లలో డిఅడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని, అదే విధంగా సైకియాట్రిస్ట్ను నియమిస్తామని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. ఎలాంటి ఘటనలైనా నిందితుల్ని వారంలోగా పట్టుకుంటున్నామన్నారు. హోం మంత్రితో పాటు ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, తదితరులు పాల్గొన్నారు.గత ప్రభుత్వ పరిపాలనలో అభివృద్ధి కుంటుపడి సంక్షేమం నామరూపాలు లేకుండా పోయిందని హోంమంత్రి అనిత విమర్శించారు. పోలీస్ వెల్ఫేర్ కూడా తమ ప్రభుత్వ అజెండాలో భాగమని వారి అభివృద్ధికి పార్టీ కృషి చేయనున్నట్లు ఆమె తెలిపారు. గత ప్రభుత్వంలో పోలీసులతో పరదాలు కట్టించడం, చెట్టుకొమ్మలు కొట్టించడం, కాపలా కాయించడంతో సరిపెట్టారు కానీ వారి సంక్షేమం మరిచారన్నారు.రాష్ట్రంలో సుమారు 20 వేల పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు త్వరలో చర్యలు తీసుకొనున్నట్లు ఆమె తెలిపారు. అభివృద్ధి సంక్షేమం అనే రెండు కళ్లతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం చేపట్టిన అన్ని సంక్షేమ పథకాలను, ప్రాజెక్టులను వైఎస్సార్సీపీ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అభివృద్ధే లక్ష్యంగా ప్రాజెక్టులను పూర్తి చేయడం, చిన్నపాటి రోడ్లను సైతం మరమ్మతులు చేపట్టడం చేస్తోందన్నారు.ఏలూరు, రాజమండ్రి, విజయవాడ వంటి ప్రాంతాల్లో బ్లేడ్ బ్యాచ్ నిర్మూలనకు ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా దుండగులు దోపిడీలకు పాల్పడుతున్నారని, అటువంటి ప్రాంతాల్లో పకడ్బందీగా పోలీస్ పహార నిర్వహించి ప్రజలకు రక్షణగా నిలవనున్నట్లు ఆమె తెలిపారు.

# ఐ ప్యాక్ టీం వైపే జగన్ ముగ్గు..

అసలు వైసీపీ ఎన్నికల ప్రచారమే వైనాట్ 175 అంటూ వైసీపీ నేతలే బిత్తరపోయే రేంజ్ లో సాగింది. పార్టీ క్యాడర్ కు, నేతలకు క్షేత్ర స్థాయి పరిస్థితులు ఏమిటి అన్నది అలోచించే సావకాశం ఇవ్వకుండా సాగిన ఆ ప్రచారం చేసిన నష్టమేమిటో పార్టీకి, పార్టీ నాయకత్వానికి ఫలితాల తరువాత కానీ తెలియలేదు. ఒటమి తరువాత వైసీపీ నేతలు బాహాటంగానే ఐప్యాక్ పై అసంతృప్తి వ్యక్తం చేశారు.వాస్తవాలు పార్టీ నాయకత్వానికి తెలియకుండా.. విజయం సాధించబోతున్నామంటూ తప్పుదోవపట్టించిందని విమర్శలు గుప్పించారు. ఇక ఐప్యాక్ తో వైసీపీ బంధం ముగిసిందనే అంతా భావించారు. అయితే 2029 ఎన్నికలలో కూడా పార్టీ తరఫున పని చేయడానికి జగన్ ఐప్యాక్ తో ఒప్పందం కుదుర్చుకోవడం వారిని దిగ్భ్రమకు గురి చేసింది.వచ్చే ఎన్నికలలో వైసీపీకి గెలుపు వ్యూహాలు రచించేందుకు ఐప్యాక్ తో జగన్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు అధికారిక ప్రకటన ఏమీ రాకపోయినా.. పార్టీలో జరుగుతున్న పరిణామాలు అలాంటి ఒప్పందం ఏదో కుదిరిందన్న సందేహాలకు తావిస్తున్నాయి. ఎందుకంటే ఎన్నికల ఫలితాల తరువాత ఐప్యాక్ పూర్తిగా సైలెంట్ అయిపోయింది. సోషల్ మీడియాలో కూడా జగన్ కు, వైసీపీకి మద్దతుగా ఎటువంటి పోస్టులూ ఐప్యాక్ పెట్టలేదు.కానీ ఇటీవలి కొన్ని రోజులుగా ఐప్యాక్ యాక్టివ్ అయ్యింది. జగన్ కు మద్దతుగా, కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ అయ్యింది. అలాగే జగన్ కూడా రాష్ట్రంలో శాంతి భద్రతలు, రాష్ట్రపతి పాలన అంటూ ఇష్టారీతిగా నోరు పారేసుకుంటున్నారు. దీంతో జగన్ మరోసారి ఐప్యాక్ కు పార్టీని వచ్చే ఎన్నికలలో విజయం బాట పట్టించేందుకు వ్యూహాల రూపకల్పన కోసం ఐప్యాక్ ను ఆశ్రయించారా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.ఇవే అనుమానాలు పార్టీలోనూ గట్టిగా వ్యక్తం అవుతున్నాయి. దీంతో వైసీపీ నేతలు, క్యాడర్ నిస్తేజంగా మారిపోయారు. మరోసారి వైసీపీని నమ్ముకుని అడుగులు వేస్తే రాజకీయ మనుగడ ఉండదన్న భయంతో సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోయారు.

# 1-19 సంవత్సరాల లోపు పిల్లలందరిచే ఆల్బెండజోల్ టాబ్లెట్స్ ను మింగించండి

## -బాల కార్మికుల నిర్మూలనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి. -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు 12:
ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలు, విద్యాసంస్థల్లో చదువుతున్న 1-19 సంవత్సరాల లోపు పిల్లలందరిచే ఆల్బెండజోల్ టాబ్లెట్స్ ను నమిలి మింగించేలా సంబంధిత ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని వైయస్సార్ సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జాతీయ నులిపురుగుల నిర్మూలనపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో నులిపురుగుల నియంత్రణ గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నులిపురుగుల కారణంగా విద్యార్థులు రక్తహీనతకు గురయ్యే ప్రమాదాన్ని నివారించేందుకు 1-19 సంవత్సరాల లోపు పిల్లలందరిచే ఆల్బెండజోల్ టాబ్లెట్స్ ను మింగించేందుకు ఉపాధ్యాయులు, ఐసిడిఎస్ సిబ్బంది, సంక్షేమ వసతి గృహాల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు ఎంపీడీఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 4,29,268 పిల్లలు ఉన్నట్లు గుర్తించారని ఈ నెల 20 వ తేదిన ఆల్ బెండ జొల్ -400మీ.గ్రా. మాత్రలను మధ్యాహ్నము భోజనం తరువాత నమిలి మింగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 1-2 సంవత్సరాల వయసు చిన్నారులకు సగం మాత్ర మెత్తగా నూరి తల్లి పాలతో కలిపి చెంచా ద్వారా ఇవ్వాలని, 3-19 సం. వయసు పిల్లలకు మధ్యాహ్నం భోజనం తరువాత ఒక మాత్రను పూర్తిగా చప్పరించి నమిలి మింగించేటట్లు అవగాహనా కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రక్తహీనతకు ప్రధాన కారణమైన నులి పురుగులను నివారించేందుకు ప్రతి విద్యార్థి ఆల్బెండజోల్ మాత్రలను తప్పక తీసుకోవాలన్నారు. భోజనం ముందు భోజనం తర్వాత విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పించేలా చరలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఏ ఒక్క విద్యార్థి ఆల్బెండజోల్ టాబ్లెట్ మింగకుండా ఉండకూడదని వైద్య బృందాలను కలెక్టర్ ఆదేశించారు.




బాల కార్మికుల నిర్మూలనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి.

బాల కార్మికుల నిర్మూలనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులు ఆదేశించారు. బాల కార్మికుల వ్యవస్థను నిర్మూలించేందుకు జిల్లాలో ఉన్న పరిశ్రమలు, హెూటళ్లు చెంచు గూడెంలు, ఇతర కర్మాగారాలలో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించాలని సంబంధిత టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులను కలెక్టర్ ఆదేశించారు. తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలందరినీ పనిలో పెట్టకుండా పాఠశాలకు పంపేలా చైతన్యం కలిగించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాలు మొక్కుబడి రీతిలో నిర్వహిస్తూ కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, హెూటళ్ళు, దుకాణాలలో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించాలన్నారు. జిల్లాలో నున్న 1250 పరిశ్రమలతో పాటు హెూటళ్ళు, దుకాణాలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన నివేదికలతో సమీక్షను ఏర్పాటు చేయాలని కార్మిక శాఖ సహాయ కమిషనర్ బహిరున్నిసా బేగంను కలెక్టర్ ఆదేశించారు.

జిల్లా సమన్వయ కమిటీ సమావేశములో ఇన్చార్జి డిఎంహెచ్ఓ డా. శారద, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రం జిల్లా ప్రోగ్రాం అధికారి డా. కాంతారావు నాయక్, ఫామిలీ డాక్టర్ ప్రోగ్రాం అధికారి డా. జగదీశ్ చంద్ర రెడ్డి, డా. సునీత, డీఈఓ సుధాకర్ రెడ్డి, ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్ట్ డైరెక్టర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఈనెల 15 నుండి సెప్టెంబర్ 30 వరకు

# రెవెన్యూ సదస్సులు

## -రెవెన్యూ సదస్సులలో చురుకుగా పాల్గొనండి. -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు 12:
జిల్లాలో ఈనెల 15 నుండి సెప్టెంబర్ 30 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు పగడ్బందీ ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సెంటినరీ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణపై జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ ఏ పద్మజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15వ తేదీ రెవెన్యూ సదస్సులను లాంఛనంగా ప్రారంభించనుందని... ఈ మేరకు ఈనెల 15 నుండి సెప్టెంబర్ 30 వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించేలా పకడ్బందీ ప్రణాళిక రూపొందించి సంబంధిత షెడ్యూల్ ను సిద్ధం చేసి పంపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల పరిశీలనకు ప్రభుత్వం ప్రతి జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించిందన్నారు. రెవెన్యూ సదస్సులకు జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. రెవెన్యూ సదస్సులో ప్రధానంగా భూ అక్రమణలు, 22 ఏ భూముల అక్రమాలతో పాటు, పలు రెవెన్యూ సమస్యలపై ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి ఆన్లైన్ చేయడంతో పాటు నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సదస్సులకు హాజరయ్యే రెవెన్యూ బృందాలు ఆర్ఓఆర్, అడంగల్, సంబంధిత రెవెన్యూ రికార్డులను వెంట తీసుకువెళ్లాలని ఆమె సూచించారు. తీసుకున్న ప్రతి ఫిర్యాదుకు సంబంధిత అర్జీదారునికి రసీదు ఇవ్వాలన్నారు. తహసిల్దారు, రెవెన్యూ ఇన్స్పెక్టర్, మండల సర్వేయర్, ఎండోమెంట్ ఇన్స్పెక్టర్, రిజిస్ట్రేషన్, ఫారెస్ట్, బ్యాంకర్లు సంబంధిత అధికారులను రెవెన్యూ సదస్సులలో భాగస్వామ్యం చేయాలన్నారు. గ్రామమంతా కలియ తిరిగి రీ సర్వే పనులు జాగ్రత్తగా చేపట్టాలన్నారు. రైతులకు పంపిణీ చేసినచేసిన భూహక్కు పత్రాలను వెనక్కి తీసుకోవడంతోపాటు వాటి స్థానంలో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు.
ప్రతి నియోజకవర్గానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ను, ప్రతి మండలానికి జిల్లా అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించామని సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రెవెన్యూ సదస్సుల్లో భాగస్వాములై ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఆగస్టు 15వ తేదీన జిల్లాలో ఆరు అన్నా క్యాంటీన్లను కూడా ప్రారంభించనున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు.

## జిల్లా పోలీసు "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ" కార్యక్రమానికి 110 ఫిర్యాదులు.

### -విచారణ జరిపి చట్ట పరిధిలో న్యాయం చేస్తాం. -జిల్లా ఎస్పీ. అధిరాజ్ సింగ్ రాణా



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 12:
నంద్యాల జిల్లా బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ అధిరాజ్ సింగ్ రాణా ఫిర్యాదిదారుల నుంచి 110 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ఫిర్యాదిదారుల సమస్యలను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్ లో మాట్లాడి చట్టపరిధిలో ఫిర్యాదిదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని , ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని , ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహరించరాదని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ లో మాట్లాడి పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యాక్రమంలో సివిల్ తగాదాలు, అత్తారింటి వేధింపులు,కుటుంబ కలహాలు,అన్నదమ్ముల ఆస్థి పంపకాలలో మనస్పర్దలు మొదలగునవి ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు నంద్యాల డిఎస్పి లు ఎన్. రవీంద్రనాథ్ రెడ్డి, రమాకాంత్, ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# మొన్న అన్నమయ్య..నేడు తుంగభద్ర..

# ప్రాజెక్టుల నాణ్యత పై ఆందోళన.

### -ప్రాజెక్టులపై సాంకేతిక నిపుణులతో తక్షణమే స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేయాలి

### -ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన బొజ్జా దశరథరామిరెడ్డి

ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఆగస్టు 12:
తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకు పోవడం వెనుకబడిన ప్రాంతాల సాగునీటి రంగం పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్య పరంపరలో భాగమేనని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్ష్యులు బొజ్జా దశరథరామిరెడ్డి విమర్శించారు. సోమవారం నంద్యాల సమితి కార్యాలయంలో దశరథరామిరెడ్డి మాట్లాడుతూ..
రాయలసీమ సాగునీటి ప్రాజెక్టల నిర్మాణ, నిర్వహణలతో పాటు పర్యవేక్షణ సరిగా లేకపోవడం వలన రాయలసీమలో అభివృద్ధి చేసిన 20 లక్షల ఎకరాల ఆయకట్టులో కేవలం 8 లక్షల ఎకరాల ఆయకట్టుకు కూడా నీరు లభించని దుస్థితిలో రాయలసీమ ప్రాంతం ఉంది. తుంగభద్ర, కృష్ణా నదులలో నీరు పుష్కలంగా ప్రవహిస్తున్నా రాయలసీమ ఆ నీటిని వినియోగించుకొనలేని పరిస్థితి ఉంది. రాయలసీమలోని ప్రాజెక్టులు ప్రమాద ఘంటికలు ఒక్కొక్కటి స్పష్టంగా మ్రోగిస్తున్నా వాటిని సరిదిద్దడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. అలగనూరు రిజర్వాయర్ కట్టలకు కోతలు, గోరుకల్లు రిజర్వాయర్ రివిట్ మెంట్ జారి పోవడం, వెలుగోడు రిజర్వాయర్ రివిట్ మెంట్ ఇబ్బందులు, వెలుగోడు రిజర్వాయర్ నుండి బ్రహ్మసాగర్ కీ నీరు చేర్చే ప్రధానమైన మద్రాసు కాలువ నిర్వహణ లోపాలు, 2009 వరదలతో సుంకేశుల నుండి కె సి ప్రధాన కాలువ బలహీన పడటం, సుంకేసుల బ్యారేజి గేట్లు, పోతిరెడ్డిపాడు రిజర్వాయర్ గేట్లు, అన్నమయ్య ప్రాజెక్టు, శ్రీశైలం రిజర్వాయర్ ప్లంజ్ పూల్, హంద్రీనీవా ప్రధాన కాలువలు, గాలేరు నగరి ప్రాజెక్టు తో సహా రాయలసీమ వ్యాప్తంగా వివిధ రిజర్వాయర్లు, బ్రాంచ్, పంట కాలువల రూపురేఖలు కూడా లేకుండాపోవడం, పి ఏ బి ఆర్ నిర్వహణ, అనేక చెరువుల గట్లు బలహీన పడటం, కృంగిపోవడం, గురురాఘవేంద్ర ప్రాజెక్టులోని ఎత్తిపోతల పథకాలు, చెరువులకు నీరు అందించే వాగులు, వంకల, కాలువల వ్యవస్థ క్షీణించడం తదితర అనేక సాగునీటి ప్రాజెక్టుల ప్రమాద ఘంటికలకు స్పందించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయి. ఈ నిర్లక్ష్యానికి కారణం పాలకులలో, అధికారులలో చిత్తశుద్ది లేకపోవడం, మనసు పెట్టి పనిచేయకపోవడమే. దాని పర్యవసానమే ఏడు సంవత్సరాలుగా నిర్జీవంగా ఉన్న అలగనూరు రిజర్వాయర్, యాభై మందికి పైగా ప్రాణాలను బలిగొన్న అన్నమయ్య ప్రాజెక్టు, వేలాది మంది రైతుల భవిష్యత్తును తలక్రిందులు చేస్తున్న తుంగభద్ర డ్యాం గేట్ తెగిపోవడం అని బొజ్జా ఆవేదన వ్యక్తపరిచారు. ప్రభుత్వం ప్రకటించినట్లుగా నదుల అనుసంధానం తో రాయలసీమను సస్యశ్యామలం చేసే అవకాశం నిర్వివాదాంశం అని బొజ్జా పేర్కొన్నారు అయితే రాయలసీమ ప్రాజెక్టుల నిర్వహణను విస్మరించి, కేవలం నదుల అనుసందానం జపం చేస్తూ ఉంటే పైన వివరించిన ఉపద్రవాలను మరెన్నో రాయలసీమ సమాజం ఎదుర్కొనాల్సి వస్తుందన్న విషయం ప్రభుత్వం గుర్తించాలని బొజ్జా హితవు పలికారు.



రాయలసీమ అభివృద్ధితో సంపద సృష్టించాలని చంద్రబాబు నాయుడు ఆద్వర్యంలో ఎన్ డి ఏ ప్రభుత్వం ఆశించడాన్ని స్వాగతిస్తున్నాము అని బొజ్జా ప్రకటించారు. ప్రస్తుత ప్రభుత్వ ఆశయ సాధనకు గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో దినదిన గండంగా ఉన్న రాయలసీమ ప్రాజెక్టుల నిర్వహణకు యుద్ధ ప్రాతిపదికన నిధులు కేటాయించి, నిర్మాణాలను సరిదిద్దకపోతే మరో అన్నమయ్య ప్రాజెక్టుగా మిగిలిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి సృష్టించే నష్టాలకు తోడు మానవ తప్పిదాల వల్ల జరిగే నష్టం రైతాంగ భవిష్యత్తును మరింత ప్రమాదంలో పడేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.
"క్షేత్రస్థాయిలో ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులను తెలుసుకోవడానికి సాంకేతిక నిపుణులతో ఒక స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేసి ప్రాజెక్టుల క్షేత్రస్థాయి నివేదికను రూపొందించి తదనుగుణంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు."అదేవిదంగా ఆంధ్రప్రదేశ్ లో 42 శాతం వ్యవసాయ యోగ్యమైన భూమి కలిగి ఉన్న రాయలసీమ సాగునీటి రంగ అభివృద్ధికి రాష్ట్ర సాగునీటి బడ్జట్ లో 42 శాతం నిదులను కేటాయించి రాయలసీమకు న్యాయం చేయాలని బొజ్జా విజ్ఞప్తి చేసారు.

# ఘనంగా ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం.

### ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రంగనాయుడు పిలుపు.

### -ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయ్.



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 12:
ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జండా ఆవిష్కరణ చేసిన ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు కామ్రేడ్ మురళీధర్ కేక్ కట్ చేసిన ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ రంగనాయుడు ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక నంద్యాల సిపిఐ కార్యాలయం నందు ఏఐఎస్ఎఫ్ జండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతి అధ్యక్షులు కామ్రేడ్ మురళీధర్ జండా ఆవిష్కరణ చేశారు. మరియు ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రంగ నాయుడు గారు కేక్ కట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఏఐవైఎఫ్ నాయకులు బాబా ఫక్రుద్దీన్ నరసింహులు ప్రసాద్ సోమన్న, జిల్లా కోశాదికారి సురేష్,విద్యార్థులు పాల్గొన్నారు.

## మహానంది నూతన తహసిల్దార్ గా రమాదేవి.



ఆంధ్ర ప్రగతి మహానంది, ఆగస్టు 12:
మహానంది నూతన తహసీల్దార్ గా రమాదేవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. పాణ్యం మండలంలో తాహసిల్దార్ గా విధులు నిర్వహిస్తున్న రమాదేవిని, సాధారణ బదిలీలలో భాగంగా మహానంది మండలానికి ఉన్నతాధికారులు బదిలీ చేయడంతో, ఈ మేరకు మహానంది తాహసిల్దార్ గా బాధ్యతలు చేపట్టారు. నూతన తహసిల్దార్ రమాదేవిని కార్యాలయ అధికారులు డిప్యూటీ రిసర్వే తహసిల్దార్ కామేశ్వర్ రెడ్డి, సిబ్బంది శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. ముందుగా మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకొని, అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం వేదపండితులు వేద ఆశీర్వచనాలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.

# ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించండి

**-అధికారులు చిత్తశుద్ధితో పని చేయండి. -పిజిఆర్ఎస్ కు 153 దరఖాస్తులు.**

**-స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లకు సర్వం సిద్ధం చేయండి.**

**-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్ట్12:
ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సెంటినరీ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించే కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్, డిఆర్ఓ ఎ. పద్మజ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం ఉదయం 9.30 గంటలకే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరై ప్రజలనుండి వినతులు స్వీకరించాలని ఆదేశించిందని ఈ మేరకు జిల్లా అధికారులందరూ 9:30 గంటలకే హాజరు కావాలని ఆదేశించారు. సోమవారం అధికారులకు ఎలాంటి సెలవులు మంజూరు చేయబడవన్నారు. ప్రజా సమస్యలు నిర్ణీత గడువులోగా పరిష్కరించకపోవడం వల్లే గ్రామ, మండల, నియోజకవర్గ, డివిజన్, జిల్లా స్థాయి దాటి అమరావతికి వెళ్లి గ్రీవెన్స్ ఇస్తున్నారన్నారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు చూసుకోలేనంత బిజీగా అధికారులు ఉన్నారని కలెక్టర్ ప్రశ్నించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా జిల్లా అధికారులు విజన్ లేకుండా వృధా నివేదికలు పంపుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రౌండ్ స్థాయిలో జిల్లా అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ మేరకు పని చేయాలే తప్ప మొక్కుబడి రీతిలో విధులు నిర్వహించడం సరికాదని కలెక్టర్ సూచించారు. క్రింది స్థాయి సిబ్బందితో సమావేశాలు నిర్వహించుకుని విధుల పట్ల చిత్తశుద్ధితో పనిచేసేలా చర్యలు తీసుకుంటూ డిపార్ట్మెంట్ పై పట్టు సాధించుకోవాలన్నారు.లి

### స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు సిద్ధం చేయండి

నంద్యాల పట్టణంలోని గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో 78వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య సమరయోధులకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, అవార్డుదారులకు ప్రత్యేకంగా సీటింగ్ అరేంజ్మెంట్ చేయాలని ఆర్డీవోను ఆదేశించారు. శకటాల ప్రదర్శన ప్రోటోకాల్ ప్రకారం అర్థవంతంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఎగ్జిబిషన్ స్టాళ్లను ఆర్డిఓతో కోఆర్డినేట్ చేసుకొని యూనిఫామ్ సైజులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో దేశభక్తి ఉట్టిపడేలా నృత్య గీతాలపన ఉండాలని డిఇఓను ఆదేశించారు. ఆహ్వాన పత్రికలన్నీ కూడా మంగళవారం సాయంత్రంలోగా పంపిణీ చేసేలా ఆర్డీవోలు, ఎంపీడీవోలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఏ ఒక్క ప్రజా ప్రతినిధి మిస్ కాకుండా ఆర్డీవోను కోఆర్డినేట్ చేసుకోవాలన్నారు.
ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొన్ని సమస్యలు 1) రుద్రవరం మండల నివాసి వేట చెన్నయ్య సర్వేనెంబర్ 843లో తనకున్న రెండు ఎకరాల పొలాన్ని తన కూతుళ్ళు, తనయుడు తనకు తెలియకుండా వాళ్ల పేరు మీద రిజిస్టర్ చేయించుకున్నారని.... నాకున్న పొలం పట్టాను ఇప్పించవలసిందిగా కలెక్టర్ ను కోరుతూ దరఖాస్తు సమర్పించుకున్నారు. 2) పాణ్యం మండలం మద్దూరు గ్రామ వాస్తవ్యుడు వెంకట సుబ్బయ్య 2014 లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటింజెంట్ వర్కర్ గా విధులు నిర్వర్తించేవాడినని.... 2019 లో నాకు తెలియకండానే సరైన కారణాలు తెలుపకుండా నన్ను విధుల నుండి తొలగించారని తనకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు ను సమర్పించుకున్నారు. 3) బేతంచేర్ల మండలం బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన అబ్దుల్ రషీద్ తన తండ్రి పేరు మీద సర్వే నంబర్ 507/సి4 లో 4 ఏకరముల 94 సెంట్ల పొలము ఉన్నదనీ మా నాన్న మరణించారని సంబంధిత పొలము కొలతలు,హద్దులు ఏర్పాటు చేసి నా సమస్యను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు.ఇంకా ఈ కార్యక్రమంలో 153 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ డిఆర్ఓఆదేశాలు జారీ చేశారు.

## భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 12:
రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం పునర్ ప్రారంభించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం ఆల్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ జిల్లా నాయకుడు గాలి రవిరాజ్ పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణం లేబర్ కార్యాలయం నందు అధికారి కి వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా నాయకుడు గాలి రవిరాజ్ మాట్లాడుతూ ఏఐసిసిటీయూ పోరాట ఫలితంగా 2019లో మాజీ స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సంక్షేమ బోర్డు నందు రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డు నందు నాలుగు లక్షల మంది సభ్యులుగా చేరడం జరిగింది కాని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి భవన నిర్మాణ కార్మికులకు ఏడు రకాల పరిహారం రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చేవారు అయితే వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి 18 వందలకోట్ల రూపాయలు నవరత్నాల సంక్షేమ పథకాల మళ్లించి కార్మికులకు తీరని అన్యాయం చేశారని వారన్నారు రాష్ట్రవ్యాప్తంగా 32,000 వేలమంది కార్మికులు సంక్షేమ బోర్డుకు పరిహారం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఐదు సంవత్సరాలలో ఒక్కరికి కూడా పరిహారం ఇవ్వలేదని వారన్నారు ఇప్పుడు ఏర్పడిన నూతన రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తిరిగి ప్రారంభించాలని వారు పేర్కొన్నారు 32,000 మంది భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి పరిహారం మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఉచిత ఇసుక పాలసీ ని ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వనీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

## అహోబిలం పారువేట ఉత్సవాల యునెస్కో గుర్తింపు కు సహకరించండి.

**-నంద్యాలఎంపీ డా. బైరెడ్డి శబరి**



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 12:
ఆళ్లగడ్డ నియోజకవర్గం పరిధిలోని నల్లమల అరణ్యం లో స్వయంభువుగా వెలసి నిత్యపూజలు అందుకుంటున్న అహోబిలం పారువేట ఉత్సవాలకు కేంద్ర ప్రభుత్వం యునెస్కో గుర్తింపుకు సహకరించంచాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డా. బైరెడ్డి శబరి కోరారు.సోమవారం ఢిల్లీలో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షేకావత్ కు నంద్యాలఎంపీ డా. బైరెడ్డి శబరి అహోబిలం పారువేట ఉత్సవాలకు యునెస్కో గుర్తింపుకు నామినేట్ చేయాలని ఉత్తరం వ్రాశారు. ప్రతి ఏటా జరిగే అహోబిలం బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వార్ల కళ్యాణోత్సవం కు అహోబిలేసుడే భక్తుల వద్దకు వచ్చి ఆహ్వానించడం ఇక్కడ విశేషం. పారువేట ఉత్సవాలల్లో భాగంగా స్వామి వారే ఆళ్లగడ్డ, రుద్రవరం, ఉయ్యాలవాడ మండలాలలోని 33 గ్రామాలకు, 45 రోజుల పాటు తరలివచ్చి భక్తులను తన కళ్యాణంకు ఆహ్వానించడం అద్భుత ఘట్టం. ఈ మహోత్తర కార్యక్రమం మరింత శోభిల్లేందుకు నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి యునెస్కో గుర్తింపుకు నామినేట్ చేయమని కోరుతూ కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను, భారత ప్రభుత్వంకు లేఖ రాయడం పట్ల అహోబిలం నరసింహ స్వామి భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

## మత్స్య సహకార సంఘంలో నూతన సభ్యులను చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

**-పాణ్యం ఎమ్మెల్యే శ్రీమతి గౌరు చరిత రెడ్డి కు విన్నపించిన ఏ పి ఎం బి సి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్.**




ఆంధ్ర ప్రగతి గడివేముల ఆగస్టు 12:
గడివేముల మండలంలోని గని గ్రామం లో మత్స్య సహకార సంఘం లో చేపల వృత్తి పై ఆధారపడి 200 కుటుంబాలు 30 సంవత్సరాలు గా జీవనం కొనసాగిస్తున్నా రు అధికారుల నిర్లక్ష్యం తో సొసైటీ లో కొత్త సభ్యులను చేర్చుటలేదు అని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి గారికి వినతి పత్రం సమర్పించారు అనంతరం ఆయన మాట్లాడు తూ గని మత్స్య సహకారా సంఘం లో గత 2దశబ్దాల ముందు గని గ్రామం లో ని బెస్తలు 200కుటుంబాలు చేపల వేటపై ఉపాధి పొందే వారు కానీ దశబ్ద కాలంగా సొసైటీ లో కొత్త సభ్యులను చేర్చకపోవడంతో 16మంది సభ్యులతో మాత్రమే సొసైటీ కొనసాగుతుంది కావున బెస్తల పై దయాతలచి నూతన సభ్యులను చేర్చేవిదంగా చర్యలు తీసుకోవాలి అని ఆయన కోరాడు అందుకు స్పందించిన ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి త్వరలో మత్స్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి నియోజకవర్గం లోని ప్రతి మత్స్యస హకారాసంఘం లోని సభ్యులు ఎదురుకుంటున్న సమస్యలను పరిష్కరిస్తాను అని ఆ మే తెలిపారు ఈ కార్యక్రమంలో బెస్త సాధికార కమిటీ జిల్లా అధ్యక్షులు పీజీ వెంకటేష్., చేపల ముని, గుర్రం వెంకటరమణ, ఈశ్వర్ ప్రసాద్, మద్దిలేటి, సామన్నా,నాగరాజు, సురేష్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల ప్రజల సమస్యలను పరిష్కరిస్తాం.

**-పలు సమస్యలపై తక్షణ పరిష్కారానికి సిబ్బందికి ఆదేశాలు.**

**- న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 12:
నంద్యాల కష్టాల్లో ఉన్నామంటే చాలు క్షణం ఆలోచించకుండా ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నారు ఆంధ్రప్రదేశ్ న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ . నంద్యాల టిడిపి కార్యాలయం నందు మన ఊరు ు మన బాధ్యత కు నంద్యాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తుల తక్షణ పరిష్కారానికి సిబ్బందికి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. దీంతో తమ కష్టాలు విన్నవించుకునేందుకు "మన ఊరు ు మన బాధ్యత" కు వచ్చిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రజలకు ఏ సమస్య వచ్చినా టిడిపి అండగా ఉంటుందని అంతే కాకుండా ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేరస్తామని మంత్రి తెలియజేశారు అనంతరం కార్యాలయానికి విచ్చేసిన ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను విని తక్షణమే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యాలయానికి విచ్చేసిన ప్రజలు తమ సమస్యల పరిష్కారం అవుతున్నాయని సంతోషంతో మంత్రి ఫరూక్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఏక్తా యాంటీ కరప్షన్ సంస్థ సేవలు సద్వినియోగం చేసుకోండి.

**-రాష్ట్ర కన్వీనర్ కన్వీనర్ మౌలానా షఫీవూర్ రెహ్మాన్.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు12:
అవినీతిని అంతం చేయడమే లక్ష్యంగా దేశంలోని 26 రాష్ట్రాలలో ఏక్తా యాంటీ కరప్షన్ సంస్థ సేవలు కోసాగుతున్నాయని అందులో భాగంగానే నంద్యాలలో కూడా మా సంస్థ యొక్క సేవలు ప్రారంభించడం జరిగిందని సంస్థ సేవలు వినియోగించుకోవాలని రాష్ట్ర కన్వీనర్ కన్వీనర్ మౌలానా షఫీవూర్ రెహ్మాన్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా పట్టణంలోని తమ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ అవినీతిపై పోరాడుతూ ప్రజాసేవ చేయడానికి మా సంస్థ నాయకులు నంద్యాలలో అందుబాటులో ఉంటారని తెలిపారు. అందులో భాగంగానే నంద్యాల అధ్యక్షులుగా షేక్ అల్తాఫ్.ఉప అధ్యక్షులుగా షేక్ అబ్దుల్లా యువజన విభాగం కన్వీనర్ గా షేక్ అబ్దుల్లా నియమించడం జరిగిందన్నారు.అదేక్రమంలో బాల కార్మికుల నిర్మూలన చేసి వారిని పాఠశాలకు పంపించే ప్రయత్నం కూడా చేస్తామని మత్తు పదార్ధాల తో జరిగే అనర్ధాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఎటువంటి తప్పు చేయకుండా జైళ్లల్లో మగుతున్న వారికి న్యాయ సహాయం అందిస్తామన్నారు ఇలా అనేక సేవలు ఏక్తా యాంటీ కరప్షన్ సంస్థ ద్వారా అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఏక్తా యాంటీ కరప్షన్ సంస్థ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రెహ్మాన్ తెలంగాణ అధ్యక్షులు ఇమాముద్దీన్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.